క్లుప్తంగా

26 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

రామాపురం : ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ హైదర్‌వలి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలలో ఈనెల 26 నుంచి 15 రోజులపాటు గ్రామస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలలో జరిగే పోటీలలో సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేడుకగా సెమీ క్రిస్మస్

రైల్వేకోడూరు : పట్టణంలోని లూథరన్ చర్చిలో శుక్రవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ప్రార్థనలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విశ్వాసి సమాధానంగా జీవించాలన్నారు. క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమని తెలియజేశారు. క్రైస్తవుల మేలు కోసం పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వానికి క్రైస్తవులంతా అండగా ఉండాలన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆకేపాటి రంగారెడ్డి, రత్నం, సాల్మన్, ప్రభాకర్, చంద్ర, భాను కుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పి.విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భూ సమస్యను పరిష్కరిచండి

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు జెడ్‌హెచ్‌డీసీ భూముల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి తహసీల్దార్ పుల్లారెడ్డిని కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల సమస్యలపై సాయికిషోర్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో రైతులు భూముల కోసం ఇబ్బందులు పడుతున్నారని వారి భూములు సర్వే నిర్వహించి వారికి చూపించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల భూములు ఆన్‌లైన్ చేయించాలని చెప్పారు. ఇందుకు తహసీల్దార్ పుల్లారెడ్డి స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మూరు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : పట్టణంలోని చందన్ సినిమాస్ ప్రాంగణంలో ప్రభాస్ నటించిన సలార్ సినిమా రిలీజ్ సందర్భంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం సినిమాను తిలకించారు.

విద్యార్థులకు అతిథి భోజనం

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ తల్లి వెంకట నరసమ్మ మూడవ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం అరవపల్లెలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సర్పంచ్ ఆధ్వర్యంలో చికెన్ బిర్యానీతోపాటు స్వీటు, అరటిపండ్లు, పిల్లలకు వడ్డించారు. కార్యక్రమంలో జంబు రవీంద్రబాబు, అక్కి వెంకటరమణ, జంబు సుదర్శన్‌లు పాల్గొన్నారు.

5 నుంచి మహాసభలు

రాజంపేట టౌన్ : వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ నుంచి మూడు రోజులపాటు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగే అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని తెలుగుభాషా సంరక్షణ సమితి జిల్లా కార్యదర్శి కాకర్ల రాముడు, సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. స్థానిక సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ తెలుగుమహాసభల పోస్టర్‌లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గౌరి, బొట్టా రామచంద్రయ్యనాయుడు, బీవీ నారాయణరాజు, మల్లెల హైమావతి, రాజా శరత్, రెడ్డయ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

పుల్లంపేట : మండలంలోని ఎస్‌ఆర్ పాలెం వద్ద శుక్రవారం పేదల కోసం నిర్మించబోయే సాయినగర్ కాలనీకి నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇంటిస్థలాలు లేక ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో వెంటనే సొంత ఖర్చులతో భూమిని చదును చేయించామన్నారు. త్వరలో ఇంటిపట్టాలు అందజేస్తామని తెలిపారు.

సంక్షేమమే ఊపిరి.. అభివృద్ధే ధ్యేయం

- జగన్ ప్రభుత్వం చేసిన మేలు, అభివృద్ధిని వివరించండి
- జీవితాంతం వైఎస్సార్ కుటుంబానికి తోడుగా నిలుస్తాం
- గాలివీడులో వైఎస్‌ఆర్‌సీపీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

గాలివీడు : సీఎం వైఎస్ జగన్ పాలన ఆదర్శంగా కొనసాగుతోందని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హతే ఆధారంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు లబ్ధి జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇప్పటి వరకు గాలివీడు మండలంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.300 కోట్లు నిధులను డీబీటీ ద్వారా ప్రజలకు అందించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగున్నరేళ్లలో 6వేల విద్యుత్ సర్వీసులను ఇచ్చామని, అదే టీడీపీ పాలనలో 1800ల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను ఇచ్చారని గుర్తుకు చేశారు. టీడీపీ హాయంలో 28వేలు పెన్షన్లు పంపిణీ అయ్యేవని, ఇప్పుడు 44వేలు పెన్షన్లు పంపిణీ అవుతున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్నికలు సమీస్తున్నందున ప్రతిపక్షాల ఎత్తులను చిత్తు చేయాలన్నారు. పవన్ కళ్యాణ్‌కు రాజకీయ అవగాహన లేదని తెలంగాణలో ఒక పార్టీ, ఆంధ్రలో టీడీపీతో పొత్తులో ఉండటమే అందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో బర్రెలక్కకు వచ్చిన ఓట్లు కూడా జనసేన అభ్యర్థులకు రాకపోవడం చూస్తే జనసేన బలం ఏంటో అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన పార్టీ తమదైతే, హామీలతో కూడుకున్న మేనిఫెస్టోనే పార్టీ వెబ్‌సైట్ నుంచి తీసేసిన పార్టీ టీడీపీ అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, సంక్షేమమే ఊపిరిగా ప్రాణం ఉన్నంత వరకు వైఎస్ కుటుంబంతోనే ఉంటానని తెలియజేశారు.

సామాజిక న్యాయం నినాదం కాదు – జగన్ ప్రభుత్వ విధానం

బడుగు, బలహీనవర్గాల సాధికారత, అభివృద్ధిని యాత్రల ద్వారా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ వివరిస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి సంకేతంగా, విజయవంతంగా సామాజిక సాధికార బస్సుయాత్రలు జరుగుతున్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టి నాలుగున్నరేళ్ల పాలనలో బడుగు, బలహీనవర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వారి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రూ.2.50 లక్షల కోట్ల నిధులను వారికి అందజేశామన్నారు. 28న రాయచోటిలో జరిగే బీసీ సాధికారిక బస్సు యాత్రను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, మండల కన్వీనర్ యదుభూషన్ రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దీన్, ఆవుల నాగభూషణ్ రెడ్డి, వేదమూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ చిన్నారెడ్డి, రమేష్‌రెడ్డి, జి.అమర్‌నాథ రెడ్డి, పి.మహేశ్వర్‌రెడ్డి, సర్పంచులు లక్ష్మిదేవి, దీప్తి, ఉమాపతిరెడ్డి, కేశవరెడ్డి, ఉమా, జానకి రామాంజులు రెడ్డి, బాబాఫకృద్దీన్, నారాయణ, క్రిష్టారెడ్డి, మల్లికార్జుననాయుడు, ఎంపీటీసీలు చిన్నరెడ్డి, చంద్రపకాష్ రెడ్డి, చిన్నారెడ్డి, అరుణ, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

రాయచోటి అర్బన్ : సమగ్రశిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు విశ్వనాథనాయక్ అన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ్మెకు సంఘీభావం

రాయచోటి టౌన్ : ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలని (పీఎస్‌టీయూ) ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షులు పిసి రెడ్డెన్న కోరారు. శుక్రవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు.

ఆర్థికసాయం

రాజంపేట రూరల్ : ఈనెల 20వ తేదీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెకానిక్ గణేష్ కుటుంబానికి శుక్రవారం రాజంపేట టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.27 వేలు ఆర్థికసాయం చేశారు. కష్టాల్లో ఉన్న ప్రతి మెకానిక్ కుటుంబాన్ని అసోసియేషన్ తరపున ఆదుకుంటామని తెలియజేశారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



రామాపురం: గోపూజను నిర్వహిస్తున్న భక్తులు



విద్యుద్దీప కాంతులలో వేంకటేశ్వరస్వామి ఆలయం

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండ గ్రామంలో వెలసిన శ్రీ దశావతార వేంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం స్వామి వారికి ప్రాతఃకాల పూజ, జపము దీక్షా, గణపతి కళన్యాస హోమములు, మహాస్నపనము, ధాన్యాధివాసము, నైవేద్యము, మంగళహారతి తదితర పూజలు జరిపారు. కోలాట భజనలను ఆకట్టుకున్నాయి. నేడు (శనివారం) వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

మహావిష్ణు ఆలయంలో ఏర్పాట్లు

రామాపురం : భక్తుల కొంగుబంగారమైన శ్రీ దేవి భూదేవి సమేత మహావిష్ణు దేవస్థానంలో శుక్రవారం వేద పండితుల మధ్య గోమాత పూజల కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త ముక్కోటి బసిరెడ్డి, భారతమ్మలు ఘనంగా ప్రారంభించారు. 24న ద్వాదశి వరకు త్రయాహ్నిక దీక్షా పూర్వకంగా వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార ప్రవేశ స్వామి దర్శనం, మహాసుదర్శన యాగము, చండియాగం, సామూహిక సత్యనారాయణ వ్రతం, గరుడోత్సవం, చక్రస్నానం, కల్యాణం జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణ రెడ్డిపల్లె పంచాయతీ తిరుమలరాయి గుట్టపై వెలసిన వెంకన్న అడవికమ్మపల్లెలో కొలువైన శ్రీ వైష్ణవ ఆలయాలతో పాటు మండలంలోని పలు గ్రామాలలో కొలువైన పలు ఆలయాలలో ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా ప్రవేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

అంగన్‌వాడీల రాస్తారోకో

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీల పట్ల ద్వంద్వ వైఖరిని విడనాడి కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మిలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక చెక్‌పోస్టు శివాలయం మూడురోడ్ల కూడలి వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకోను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో చైర్మన్ పోకల సుబ్బరాయుడు, ఉప సర్పంచ్ శివసాయి ఆధ్వర్యంలో భువనేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అర్చకులు లలితా సహస్రనామార్చన నిర్వహించి కుంకుమార్చన చేశారు. పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాస్కులు తప్పనిసరి

నందలూరు(రాజంపేట) : ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కొత్త వైరస్ వ్యాప్తి చెందుతున్న తరుణంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైరస్ వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మతసామరస్యానికి ప్రతీక ఉరుసు ఉత్సవం

హజరత్ ఖాదర్ వలి దర్గాలో ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేడా

నందలూరు(రాజంపేట) : మతసామరస్యాలకు ప్రతీకలుగా ఉరుసు ఉత్సవాలు నిలుస్తున్నాయని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగిరెడిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ రైల్వే కేంద్రంలో వెలసిన హజరత్ ఖాదర్ వలి 132వ ఉరుసు మహోత్సవంలో ఎమ్మెల్యే మేడా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కూడలి నుంచి రైల్వేస్టేషన్ వద్ద వెలసిన హజరత్ ఖాదర్ వలి దర్గా వరకు బాణసంచా కాలుస్తూ, డప్పు వాయిద్యాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉరుసు మహోత్సవం కులమతాలకు అతీతంగా జరగడం ప్రత్యేకమని, ఇది ఐకమత్యాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువా, పూలమాలలతో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, జెడ్పీటీసీ ప్రతినిధి సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర మూర్తి, సర్పంచ్ సూర్యనారాయణ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, అనుదీప్ సింహ, ఎస్‌కే షావలి, షమీవుల్లా ఖాన్, నడివీధి సుధాకర్, నవాబ్, హిమగిరి నాథ్ యాదవ్, టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, నరసింహ శెట్టి, వైస్ సర్పంచ్ ఇబ్బు, గుణ యాదవ్, ఎంపీటీసీ ప్రభాకర్, ఆర్ముగం విశ్వనాథ్, నాగసుబ్బయ్య, కాకి చంద్ర, మధు యాదవ్, జుల్ఫికర్, గ్రీష్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి

సంక్రాంతి పండుగ వస్తోంది జీతాలు ఇప్పించాలని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున రెడ్డి దగ్గర మొరపెట్టుకున్నారు. శుక్రవారం ఉరుసు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేను నందలూరు రైల్వే కేంద్రంలో నాగిరెడ్డిపల్లె కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు కలిసి తమకు మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సర్పంచ్ సూర్యనారాయణను పిలిపించి సమస్యను అడుగగా రెండు నెలల జీతాలు వెంటనే ఇస్తామని హామీ ఇచ్చారు.

శాస్త్రీయ దృక్పథం నెలకొల్పడమే లక్ష్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేవీవీ నాయకులు

నందలూరు(రాజంపేట) : సమాజంలో శాస్త్రీయ దృక్పథం నెలకొల్పడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జేవీవీ జిల్లా నాయకులు షేక్ రౌఫ్ బాషా, నందలూరు మండల నాయకులు కృపానందం, ఎంవీ రమణలు తెలిపారు. శుక్రవారం స్థానిక నందలూరు హైస్కూల్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విభాగాలలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ భావజలాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. వాస్తవికత, మూఢచారాల మధ్య తేడాలని వివరించారు. టాలెంట్ టెస్టులో ప్రైవేటు విభాగంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు మొదటిస్థానం, రెండు, మూడు స్థానాలు ఆల్విన్ మౌంట్ కార్మెల్ స్కూల్ రెండు టీమ్‌ల విద్యార్థులు సాధించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పాటూరు స్కూల్ విద్యార్థులు మొదటిస్థానం, నందలూరు స్కూల్ విద్యార్థులు రెండవస్థానం, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడవస్థానం సాధించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, పతకాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్టీయూ నాయకులు షఫివుల్లా, యూటీఎఫ్ నాయకులు రమేష్, జేవీవీ నాయకులు బాబు, మనోహర్, నాగలక్ష్మీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై శిక్షణ

రామాపురం/సిద్ధవటం : మామిడిలో పూత, పిందే సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యాన అధికారులు రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం జరిగిన రామాపురం, సిద్ధవటం మండలాల్లో జరిగిన శిక్షణల్లో లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారి టి.నాగమణి, బద్వేల్ ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి, శాస్త్రవేత్త మానసలు పలు సలహాలు, సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ పూత త్వరగా, ఒకేసారి రావడానికి ఆడ పూల శాతం పెరగడానికి 13-0-45 (మల్టీకే) 10 గ్రాములు 1 లీటరు నీటికి, మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని, మామిడిలో పూమొగ్గ దశలోనే తేనె మంచు పురుగు, మసి తెగుళ్లు, పక్షి కన్ను తెగుళ్లు, బూడిద తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు మోనోక్రోటోఫస్ 1.6 మి.లీ ఒక లీటరు నీటికి, మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. తెల్లపూత దశలో ఆశించే తేనె మంచు పరుగు, బూడిద తెగుళ్లు, పక్షి కన్ను తెగుళ్ల నివారణకు బుప్రోఫెజిన్ 1.5 మి.లీటరు నీటికి , కంటాఫ్ 2మి.లీ లీటరు నీటికి అజాడిర్రెక్టిన్ మి.లీ లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. మామిడి పిందెలు గోలికాయ నుంచి నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు మరోమారు యూరియా 1కేజీ, పొటాష్ 750 గ్రాములు చెట్లకు చొప్పున భూమిలో వేసి ఫిబ్రవరి, మార్చినెలలో నీటి తడులను 15 రోజులకు ఒకసారి ఇవ్వాలని, మామిడి గోలికాయ దశ నుంచి నిమ్మకాయ దశ వరకు ఆశించే తోడిమకుళ్లు తెగుళ్ల నివారణకు అమిస్టార్ 1మి.లీ లీటరు నీటికి లేదా నాటిఓ 1 గ్రా లీటరు నీటికి పిచికారీ చేయాలని మామిడి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు వేళాయె

- రేపు రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం
- ముస్తాబైన చర్చిలు



పశువుల పాకలో బాలయేసు జననం తెలియజేసే సెట్టింగ్

రాజంపేట టౌన్ : లోకాన్ని రక్షించేందుకు సృష్టికర్త అయిన యెహోవా తన ప్రియ కుమారుడైన ఏసుక్రీస్తును భువికి పంపాడని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం . ఏసుక్రీస్తును ఈ భూమికి కానుకగా ఇచ్చిన పవిత్ర దినమే క్రిస్మస్. అందువల్ల క్రైస్తవులు, విశ్వాసులు క్రిస్మస్ వేడుకలను పేదలు, ధనవంతులు అన్న తేడా లేకుండా ఘనంగా జరుపుకుంటారు. జెరూసలేంలోని బెత్లహేములో ఓ పశువుల పాకలో ఏసుప్రభువు జన్మించారు. అందువల్ల క్రైస్తవులు తమ ఇళ్లల్లో, చర్చిల్లో క్రీస్తు జననానికి చిహ్నంగా పశువుల పాకలను ఏర్పాటు చేశారు. గత కొద్ది రోజుల నుంచే వివిధ ప్రాంతాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు, విశ్వాసులు క్రిస్మస్ రాకను పురస్కరించుకొని నిత్యం ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ప్రేమానురాగాలను పంచాలన్న క్రీస్తు సందేశాన్ని ఈ సందర్భంగా పాస్టర్లు తెలియజేస్తున్నారు.

ప్రార్థనలకు సర్వం సిద్ధం

క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు, విశ్వాసులు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే తమ ఇళ్లపై స్టార్‌లను ఏర్పాటు చేశారు. అలాగే ఇళ్లల్లో, ఇంటి ముంగిట క్రిస్మస్ ట్రీలను అలంకరించారు. ఏసుక్రీస్తు జననానికి చిహ్నంగా ఆదివారం రాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే చర్చిలు విద్యుత్ కాంతులతో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. క్రిస్మస్‌ను వేడుకగా జరుపుకునేందుకు క్రైస్తవులు సమాయత్తం అయ్యారు. క్రిస్మస్ తాత వేషధారణలతో బహుమతులు ఇచ్చేందుకు, యువత క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడేందుకు సన్నద్ధమయ్యారు.

ఇదీ క్రిస్మస్ తాత ఇతివృత్తం

సెయింట్ నికోలస్ అనే గ్రీకు బిషప్ స్ఫూర్తితో శాంటా క్లాజ్ అనే ఒక పాత్ర రూపుదిద్దుకుంది. 1823లో అమెరికా, బ్రిటన్ దేశాల్లో శాంటా క్లాజ్ వర్ణనపై రచించిన ఏ విజిట్ ఫర్ సెయింట్ నికోలస్ అనే కవిత ఆధారంగా థామస్ నెస్ట్ అనే చిత్రకారుడు శాంటా క్లాజ్ ఊహాచిత్రాన్ని గీశాడు. దీని ఆధారంగానే క్రిస్మస్ తాత రాత్రివేళల్లో రథంపై ఆకాశ మార్గాన పయనిస్తూ మంచి ప్రవర్తన గల పిల్లలకు బహుమతులు ఇస్తాడని, చెడు ప్రవర్తన గల పిల్లలకు బొగ్గు ఇస్తాడని క్రైస్తవులు విశ్వసిస్తారు.

నిత్యజీవనానికి చిహ్నం క్రిస్మస్ ట్రీ

క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ ట్రీకి కూడా క్రైస్తవులు, విశ్వాసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. పండుగను పురస్కరించుకొని క్రైస్తవులు, విశ్వాసులు విధిగా తమ ఇళ్లల్లో ట్రీని ఏర్పాటు చేస్తారు. ప్రపంచ దేశాల్లో ఒకొక్క దేశంలో క్రిస్మస్ ట్రీకి సంబంధించి పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఆధునిక జర్మనీ ఏర్పడిన తరువాత క్రిస్మస్ ట్రీ ప్రాచుర్యంలోకి వచ్చినట్లు క్రైస్తవులు చెబుతున్నారు. 16వ దశాబ్దంలో మార్టిన్ లూథర్ మొదటిసారిగా ఎవర్ గ్రీన్ అనే చెట్టును కొవ్వొత్తులతో అలంకరించినట్లు చెబుతున్నారు. నిత్యజీవనానికి సంకేతంగా క్రిస్మస్ ట్రీని అలంకరిస్తారు.



విద్యుత్ దీపకాంతులలో ప్రార్థనా మందిరం

గణిత మేధావి 'రామానుజన్'

భారతదేశ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని మూడు నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. గణిత శాస్త్రానికి ఆయన చేసిన విశేష సేవలను గుర్తు చేశారు. గణిత విశ్లేషణ, సంఖ్యాశాస్త్రం, అనంత శ్రేణులు, జామెట్రీ, త్రికోణమితి తదితర విభాగాల్లో రామానుజన్ పరిశోధనలు చేసి భావితరాలకు గణిత సంపదను అందజేశారన్నారు. విద్యార్థులు రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలంటూ సూచించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట: ఏఐటీఎస్‌లో..



సిద్దవటం: గణిత శాస్త్ర సైన్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



సంబేపల్లె: విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం



పుల్లంపేట: విద్యార్థినీకి బహుమతులు అందిస్తున్న ఎంఈఓ



ఓబులవారిపల్లె: పెనగలూరులోని హైస్కూల్‌లో గణిత గుర్తులతో కూడిన ముగ్గును వేస్తున్న విద్యార్థినులు



రాయచోటి టౌన్: జ్యోతీప్రజ్వలన చేస్తున్న దృశ్యం



రాయచోటి అర్బన్ : రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు